సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
6లో..
సాగు చట్టాలను ఉపసంహరించుకోవాలి



మరో రెండు గ్యారంటీలకు శ్రీకారం

- నేడు సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ అమలు
- 1.49 గ్యాస్ కనెక్షన్లు
- రూ.2.21 కోట్లు ఆదా
- జిల్లాలో ఆరు గ్యారంటీలకు 1.92 లక్షల దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అభయ హస్తం పేరిట స్వీకరించిన ఆరు గ్యారంటీల్లో మరో రెండు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంచిన ప్రభుత్వం మరో అడుగు వేయనుంది. మహాలక్ష్మీ పథకంలో రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు కానుండడంతో జిల్లాలోని దరఖాస్తుల దారుల్లో ఆసక్తి పెరిగింది. జిల్లాలో ఆరు గ్యారంటీలకు 1.92 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రస్తుతం రెండు గ్యారంటీలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం సేకరించింది. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం ద్వారా ఉచిత విద్యుత్ కోసం 1.42 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హులకు సంబంధించిన వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేశారు. 1.22 లక్షల మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు సంబంధించి 1.65 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు గ్యారంటీల్లో ఎంత మందికి లబ్ధి చేకూరుతుందనే ఆసక్తి నెలకొంది.

ఉచిత విద్యుత్ అర్హులు 1.22 లక్షల మంది

గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అర్హుల సంఖ్య తేల్చడానికి సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం కసరత్తు చేస్తోంది. ప్రత్యేక డ్రైవ్ ద్వారా సెస్ అధికారులు సిబ్బంది, స్పాట్ బిల్లింగ్ మిషన్‌తో పాటు మొబైల్‌లో ప్రత్యేక యాప్ ద్వారా విద్యుత్ మీటరు కనెక్షన్ల ప్రకారం ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ల వంటి వివరాలను పొందుపర్చారు. మార్చిలోనే జీరో బిల్లు వచ్చే విధంగా ఉచిత విద్యుత్ గ్యారంటీ అమల్లోకి తెచ్చే విధంగా జాబితా సిద్ధం చేశారు. జిల్లాలో గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లకు సంబంధించి 1,42,966 మంది దరఖాస్తు చేసుకున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్నవారిని అర్హులుగా ప్రకటించారు. జిల్లాలో తెల్లరేషన్ కార్డులు 1,73,768 ఉన్నాయి. ఇందులో ఉచిత విద్యుత్ అర్హులుగా సెస్ పరిధిలో 1.78 లక్షల గృహ అవసరాల కనెక్షన్లలో ఇంటింటి సర్వే చేసి 1.22 లక్షల మంది వినియోగదారుల వివరాలను అప్‌లోడ్ చేశారు. అద్దెకు ఉంటున్న వారి వివరాలు కూడా అప్‌లోడ్ చేశారు. రెండు పథకాలు అమల్లోకి వస్తుండడతో ఎంతమంది లబ్ధి పొందుతారనే ఆసక్తి నెలకొనగా కాంగ్రెస్ శ్రేణులు గ్యారంటీ పథకాల అమలు సంబరాలకు సిద్ధమయ్యారు.

గ్యాస్ సిలిండర్లపై రూ.2.21 కోట్ల ఆదా

జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే సిలిండర్‌ను అందించనుండడంతో ప్రతి నెలా రూ.2.21 కోట్లు ఆదా కానుంది. జిల్లాలో 1.49 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో సింగిల్ సిలిండర్ల కనెక్షన్లు 55,860, డబుల్ సిలిండర్ల కనెక్షన్లు 34,474, సీఎస్ఆర్ కనెక్షన్లు 14,452, దీపం కనెక్షన్లు 25,033, ప్రధాన మంత్రి ఉజ్వలయోజన కనెక్షన్లు 19,426 ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా వినియోగదారులు 46,896 సిలిండర్లను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం రూ.500కే సిలిండర్ ఇవ్వనుండడంతో లబ్ధిదారులకు రూ.2.21 కోట్లు ఆదా కానుంది. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.973.50 ఉంది. ప్రభుత్వం ఇప్పటికే సబ్సిడీకి సంబంధించి రూ.80 కోట్లు పౌరసరఫరాల శాఖకు విడుదల చేసింది. సబ్సిడీ ఖాతాల్లో పడుతుందా? నేరుగా తగ్గించి ఇస్తారా? అనే దానిపై లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 26: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం సందర్భంగా ఆలయ అధికారులు గర్భాలయంలో ఆర్జిత సేవలు నిలిపివేసి శీఘ్ర దర్శనం అమలు చేశారు. దీంతో క్యూ లైన్లు వేగంగా సాగి భక్తులు త్వరితగతిన స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ వంటి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

రాజన్న సేవలో ఎస్‌బీఐ డీజీఎం

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ వివేక్ చంద్ర జైస్వాల్ సోమవారం దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు బి.తిరుపతి రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు, ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎస్బీఐ వేములవాడ చీఫ్ మేనేజర్ సుబ్బారావు ఉన్నారు.



ప్రసాదం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్

కమనీయం.. మల్లికార్జునస్వామి కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం పూజారులు స్వామి వారి లగ్న పట్నం, నాగవెల్లి పట్నం నిర్వహించారు. మల్లికార్జున స్వామి సహిత మేడాలమ్మ, గొల్లకేతమ్మ, రేణుక ఎల్లమ్మ కల్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. సంఘం నాయకులు దేవేందర్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, రాజమల్లయ్య, రాములు, దేవయ్య, భాస్కర్, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా గుడిసె సదానందం

సిరిసిల్ల క్రైం , ఫిబ్రవరి 26: వేములవాడ సీనియర్ సివిల్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా గుడిసె సదానందంను నియమిస్తూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే సదానందం జూనియర్ సివిల్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. తాజాగా సీనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వేములవాడ పట్టణం శాత్రాజుపల్లికి చెందిన సదానందం 13 ఏళ్లుగా న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సదానందం నియామకం సందర్భంగా పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు .

రూ.30 లక్షలతో అంబేద్కర్ కూడలి సుందరీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి

వేములవాడ, ఫిబ్రవరి 26: వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ కూడలిని రూ.30 లక్షల అంచనాతో సుందరీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించామని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తెలిపారు. సోమవారం నిర్వహించిన పురపాలక సంఘం పాలకవర్గం సభ్యుల సాధారణ సమావేశంలో మాట్లాడారు. మహాశివరాత్రి జాతరలో భక్తులకు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.14.80 లక్షలతో ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. జాతరలో శానిటేషన్ నిర్వహణ, పలు కూడళ్లలో విద్యుత్ దీపాల ఏర్పాటు, నీటి సరఫరా నిమిత్తం రూ.14 లక్షల 80 వేల నిధులను కేటాయించామన్నారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని, ఆ ప్రాంతమంతా కళావిహీనంగా తయారైందని కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ మాట్లాడుతూ కూడలి సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపామన్నారు. పట్టణంలోని ప్రస్తుత గంగమ్మ తల్లి పార్కు వద్ద, రెండో బైపాస్ రహదారిలో రెండు చోట్ల రూ.25 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు తీర్మానించామన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రస్తుతం రూ.5లక్షల నిధులను కేటాయించామన్నారు. కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్ రెడ్డి, టీపీవో సాయికృష్ణ, ఏఈలు నరసింహస్వామి, నర్మద, కౌన్సిలర్లు రెండుమిద్దెల జయ, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జడల లక్ష్మి, నీలం కళ్యాణి, కందుల శ్రీలత, జోగిని శంకర్, సిరిగిరి రామచందర్, యాచమనేని శ్రీనివాసరావు, గడ్డమీది లావణ్య, బింగి మహేశ్, తిరుమల్ రెడ్డి కవిత, చింతపంటి దివ్య కుమ్మరి శిరీష, రేగుల సంతోష్ బాబు, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, అన్నారం ఉమారాణి, లక్ష్మి, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యురాలు సువర్ణ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికతో చదవాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: క్రమశిక్షణ, ప్రణాళికతో చదివితే లక్ష్య సాధన సాధ్యమవుతుదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు స్థానిక మాతృశ్రీ గార్డెన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలని, పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి మెడిటేషన్ యోగ వంటివి చేయాలని సూచించారు. జీవితంలో ఉన్నత విజయాలను చేరుకోవడానికి శ్రమించాలన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మండలంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షప్యాడ్లను, వాటర్ బాటిళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భీంశర్మ, సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, సైకాలజిస్టు స్వామి, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆర్థిక అక్షర్యాసతపై రూపొందించిన పోస్టర్‌లను జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి శుక్రవారం వరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వీరాంజనేయులు, యూబీఐ చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ లోవరాజు, లీడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోను కలిసిన కళాకారులు



పూలమొక్కను అందజేస్తున్న కళాకారులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26: జిల్లా పౌర సంబంధాల అధికారిగా బదిలీపై వచ్చిన వంగరి శ్రీధర్‌తోపాటు ఇక్కడ పనిచేసి హైదరాబాద్ కమిషనర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన మామిండ్ల దశరథంను సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి టీం లీడర్ పొత్తూరి రాజు, గడ్డం దేవయ్య, పూడూరి సంజీవ్, అంతడ్పుల ఝాన్సీ అంతడ్పుల లావణ్య, కిన్నెర, శ్రీలత, అనుముల శిరీష పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా భావించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 26: మన వాడ - మన ఊరును పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 13 వార్డు పెద్ద బజార్‌లో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని పెద్దబజార్ దుకాణాల యజమానులకు స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మన వాడ - మన ఊరు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పెద్దబజార్‌లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



- నిమిషం నిబంధన అమలు
- జిల్లాలో 8543 మంది విద్యార్థులు
- 18 పరీక్ష కేంద్రాలు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసేందుకు టెలీ మానస్
- జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 9440599965
- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించరు. ఈ సంవత్సరం కూడా 'వన్ మినిట్' నిబంధన అమలు చేస్తుండడంతో విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష పూర్తిగా ముగిసిన తర్వాతనే విద్యార్థులను బయటకు పంపిస్తారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాల ద్వారా 8543 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇంటర్ జనరల్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు 4609 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 3,934 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్ ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 463 మంది, రెండో సంవత్సరం 481 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు సీసీ కెమెరాలతో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు. పరీక్ష సమయంలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసివేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద వైద్యసిబ్బందితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచి నీరు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు.

పరీక్షల నిర్వహణకు 330 మంది సిబ్బంది

జిల్లాలో సీసీ కెమెరాల నీడలో ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇద్దరు డీఈసీలు, ఒక్కో పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌లుగా 18 మంది, అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులు 18 మంది, మరో ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ నుంచి ముగ్గురు సభ్యులతో ఫ్లయింగ్ స్క్వాడ్, ముగ్గురు కస్టోడీయన్స్‌ను నియమించారు. పోలీస్ స్టేషన్‌లలో పరీక్ష పత్రాలను ఉంచారు. పరీక్ష పత్రాలు సీసీ కెమెరాల ముందే తెరవనున్నారు. ప్రతీ 25 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమిస్తున్నారు. ఇందుకు ఇన్విజిలేటర్ల నియామకం కూడా పూర్తి చేశారు. దాదాపు 330 మంది వరకు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించనున్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. పరీక్ష గదుల్లోకి సెల్ ఫోన్‌లు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదు. విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లలో పొరపాట్లు ఉంటే చూసుకోవాలని కోరుతున్నారు. ఫొటోలు, సబ్జెక్టులు, సంతకం వంటివి సరిగా ఉన్నాయా? లేదా? సరిచూసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఒత్తిడిని దూరం చేసేందుకు టెలీమానస్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్లు 14416, 1800914416తో పాటు జిల్లా కేంద్రంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 9440599965కు ఫోన్ చేసి సమస్యలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు.

జిల్లాలో పరీక్ష కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు), సెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, సహస్ర జూనియర్ కళాశాల, సాయిశ్రీ జూనియర్ కళాశాల, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, వేములవాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పవిత్ర జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, సుమిత్ర జూనియర్ కళాశాల, కోనరావుపేట, ఇల్లంతకుంట, చందుర్తి, గంభీరావుపేట, రుద్రంగి, ముస్తాబాద్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాచర్ల జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు

- మోహన్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి



జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 18 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థుల్లో ఒత్తిడి దూరం చేసేందుకు 'టెలీ మానస్' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. రెండు హెల్ప్‌లైన్ నంబర్లు 14416, 1800914416 అందుబాటులో ఉంచింది. జిల్లాలో సైతం హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. హెల్ప్‌లైన్ నంబరు 9440599965కు కాల్ చేయవచ్చు. పరీక్ష కేంద్రాలకు గంటముందే చేరుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దు.



సిరిసేడు ఎంపీటీసీపై అనర్హత వేటు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 26: మండలంలోని సిరిసేడు ఎంపీటీసీ రేణికుంట్ల చిన్నరాయుడుపై అనర్హత వేటు వేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 9న చిన్నరాయుడుతో పాటు రామస్వామి, శశికుమార్, రమేష్‌లు సిరిసేడు, బోగంపాడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాన్ని జేసీబీ సహాయంతో ధ్వంసం చేసి ఆ స్థలాన్ని కబ్జా చేయాలని చూశారని స్థానిక పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అంకూస్‌లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సిరిసేడు ఎంపీటీసీ చిన్నరాయుడుపై అనర్హత వేటు వేయడంతో పాటు అతడు ఆరు సంవత్సరాలు ఎలాంటి పదవికి పోటీకి అనర్హుడని ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 26: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 56మంది రైతులు 528క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 28క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు.. తప్పిన ప్రమాదం


అన్నారంలో వరిపొలంలోకి దూసుకెళ్లిన కారు

మానకొండూర్, ఫిబ్రవరి 26: మండలంలోని అన్నారం గ్రామంలో ఓ కారు పొలంలోకి దూసుకెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని దేవంపల్లి గ్రామ మాజీ సర్పంచు జనగామ దేవేందర్‌రావు వ్యక్తిగత పనులపై తన కారులో మానకొండూర్‌కు వెళ్లి తిరిగి దేవంపల్లికి వస్తున్నాడు. అన్నారం గ్రామ శివారులో కారు అదుపు తప్పి వరిపొలంలోకి దూసుకెళ్లింది. స్థానికులు గమనించి కారులో ఉన్న దేవేందర్‌రావును బయటికి తీశారు. రోడ్డు పక్కనే వ్యవసాయబావి ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆయనకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

భారీ ఎత్తున ఇసుక డంపింగ్

● కేసు నమోదు చేసిన పోలీసులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 26: మండలంలోని వంతడుపులలో అక్రమంగా ఇసుకను డంపింగ్ చేసి వరంగల్ జిల్లాకు తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా నుంచి అక్రమంగా ఇసుకను తరలించి వంతడుపుల గ్రామంలో డంపింగ్ చేసి అక్కడ నుంచి వరంగల్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెండు ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. 20 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్‌కు అప్పగించి సదరు ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 8 మందికి శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 26: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మంది వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానాలు విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల పట్టుబడిన 16 మంది వాహనదారులను సోమవారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి 10 రోజులు, ఒకరికి 7 రోజులు, ఒకరికి 5 రోజులు, నలుగురు వ్యక్తులకు 3 రోజుల వంతున జైలుశిక్ష, మొత్తం 16 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు. మరో 8 మందికి 15 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఈకి గాయాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 26: కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేటలో పంచాయతీరాజ్ ఏఈగా పనిచేస్తున్న అంజయ్యకు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం ఏఈ అంజయ్య ద్విచక్రవాహనంపై వేములవాడ వైపు వెళుతున్న సమయంలో సుద్దాల మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడం వల్ల చేతికి గాయాలయ్యాయి. గాయాలైన ఏఈని సిరిసిల్ల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం ప్రసాద్ (45) అప్పుల బాధతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ప్రసాద్ తన కూతురు పెళ్లి కోసం, కొడుకు కోసం అప్పు చేశాడు. అప్పు తీరే మార్గం లేక మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకున్నాడు. ప్రసాద్ భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 26: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యాడు. కొండాపూర్ గ్రామానికి చెందిన సర్థాని అజయ్‌కుమార్ అనే యువకుడు ముస్తాబాద్ నుంచి కొండాపూర్‌కు ద్విచక్రవాహంపై వెళుతుండగా ప్రమాదవశాత్తు అదపుతప్పి పడిపోయాడు. వాహనదారులు గమనించి అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 26: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన జనగామ రాజమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయిన రాజమ్మ ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సోమవారం తెల్లవారు జామున 11ఏ క్రాస్ రోడ్డు వద్ద రాజమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారుల సమాచారంతో 108 సిబ్బంది గాయపడ్డ రాజమ్మను గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించేలోపే రాజమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

చెట్టుకొమ్మ మీదపడి ఒకరి మృతి


కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26: చెట్టు కొమ్మ కొడుతూ ప్రమాదవశాత్తు ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని వెన్నంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. వెన్నంపల్లి గ్రామానికి చెందిన మేడి రాజు (35) కట్టెల కోసం సోమవారం గ్రామ శివారులోని గుర్రాల గండి ప్రాజెక్టు సమీపానికి వెళ్లాడు. చెట్టు కొమ్మ కొడుతుండగా ప్రమాదవశాత్తు రాజుపై పడింది. తీవ్ర గాయాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కిరాణ వ్యాపారి ఆత్మహత్య


కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 26: కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన కొమిడి జలపతిరెడ్డి(55) సోమవారం సాయంత్రం ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జలపతిరెడ్డి ఆదర్శనగర్‌లో కిరాణ షాపు నిర్వహిస్తుంటాడు. అతనికి ఇద్దరు కూతుళ్లు కాగా వారికి వివాహం జరిగిందని బంధువులు తెలిపారు. ఆదివారం తన భార్య, కూతురును హైదరాబాద్‌లో దిగబెట్టి సోమవారం ఉదయమే ఇంటికి వచ్చిన జలపతి రెడ్డి సాయంత్రం ఇంటి వెనుకవైపున ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

















డాక్టర్

జేరియాట్రిక్



'వయసు పైబడుతోంది కదా! మునుపటి ఓపిక ఉండదులే! ఇదంతా సహజం' అని సరిపెట్టుకుంటున్నారా? కానీ మలి వయసుకు చేరుకుంటున్నా, సత్తువ సడలకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఎనభైలో నలభైలా



వయసు పైబడేకొద్దీ పుట్టిన రోజు దగ్గర పడుతుంటే గుండెల్లో బేజారు మొదలవుతూ ఉంటుంది. యాభైకి చేరుకుంటే అర్థాయుష్షు అయిపోయిందే అని కొంత నిరాశకు లోనయ్యేవాళ్లూ ఉంటారు. నిజానికి ఒంట్లో తగ్గిపోయే హుషారు, చలాకీతనం, పెరిగిపోయే నిస్సత్తువ, నీరసాలు పైబడే వయసును అనుక్షణం గుర్తు చేస్తూనే ఉంటాయి. 'అప్పట్లో నేను అలవోకగా పనులన్నీ చేసుకోగలిగేదాన్ని, సునాయాసంగా పనులన్నీ చక్కబెట్టేదాన్ని, చకచకా పరుగులెత్తేదాన్ని' అని పాత రోజుల గురించి గర్వంగా చెప్పుకోవడమే కాదు, అదే ఆరోగ్యాన్నీ, శరీర దారుఢ్యాన్నీ మున్ముందు కూడా కొనసాగించే వీలుంది. అయితే అందు కోసం ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలి. చేసే పనులు, తీసుకునే ఆహారం పట్ల శ్రద్ధ కనబరచాలి. మరీ ముఖ్యంగా మనసు వయసు పైబడనీయకూడదు.

క్రమం తప్పని వ్యాయామం

పైబడే వయసులో కండరాల నొప్పులు వేధిస్తున్నాయంటే, కండరాల పటుత్వం తగ్గిందని అర్థం. కీళ్ల నొప్పులు మొదలైనప్పుడు, రోజూ నడవడం మొదలు పెట్టండి అని వైద్యులు సూచిస్తూ ఉంటారు. కీళ్లు అరగడం మొదలైతే నడవడం వల్ల అవి ఇంకా వేగంగా అరిగిపోతాయి కదా? అని అయోమయానికి గురి కాకూడదు. నడక వల్ల కాళ్లలోని కండరాలు బలం పుంజుకుని ఊతాన్నిస్తాయి. దాంతో కీళ్ల మీద ఒత్తిడి తగ్గి అవి అరిగే వేగం నెమ్మదిస్తుంది. పైగా రోజు మొత్తంలో





పది వేల అడుగులు నడిచే వ్యక్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని శాస్త్రీయంగా రుజువైంది. కాబట్టి కండరాల పటుత్వం కోసం నడక, ఈత, సైక్లింగ్... ఇలా నచ్చిన వ్యాయామానికి దైనందిన జీవితంలో చోటు కల్పించాలి. ఏరోబిక్స్‌తో పాటు రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయవచ్చు. ఎముకల దృఢత్వం కోసం వెయిట్ ట్రైనింగ్ కూడా చేస్తూ ఉండాలి. బరువులు ఎత్తడం వల్ల కండరాలు బలం పుంజుకోవడంతో పాటు, శారీరక దారుఢ్యం కూడా పెరుగుతుంది.

సమతులాహారం

ఆదివారం వస్తే నాన్ వెజ్, మిగతా రోజులంతా వెజిటేరియన్ వంటకాలను వండుకోవడం మన ఆనవాయితీ. కానీ అన్ని రకాల పోషకాలూ సమపాళ్లలో అందాలంటే ఏ పదార్థాల్లో ఏ పోషకాలుంటాయో అవగాహన ఏర్పరుచుకుని రోజు మొత్తంలో సరిపడా పోషకాలన్నీ అందుతున్నాయో లేదో గమనించుకుంటూ ఉండాలి. నాన్ వెజ్ వండుకుని తింటే ప్రొటీన్ ఒక్కటే అందుతుంది. మరి మిగతా విటమిన్లు, ఖనిజ లవణాలు, సూక్ష్మపోషకాల మాటేమిటి? అలాగే కేవలం ఒక్క కూరగాయతో సరిపెట్టుకుంటే ప్రొటీన్ దక్కేదెలా? కాబట్టి వారాంతాల్లో నాన్‌వెజ్‌కు పరిమితమయ్యేవాళ్లు, కూరగాయలతో కలిపి నాన్ వెజ్ వండుకోవడం, లేదా అదనంగా వెజిటేరియన్ వంటకం చేసుకోవడం అవసరం. అలాగే కూరగాయలను పప్పుదినుసులతో కలిపి వండుకోవడం, గుడ్డుతో కలిపి వండుకోవడం లాంటివి కూడా చేయవచ్చు.



ప్రొటీన్ సరిపడా

సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనత తలెత్తకుండా ఉండడానికీ సరిపడా ప్రొటీన్ అవసరం. మాంసాహారం తినలేని వాళ్లు కంది, పెసరపప్పులను తినవచ్చు. చిక్కుళ్లు, బఠాణీ, మునగ, పుట్టగొడుగుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రతి రోజూ ఆహారంలో సరిపడా ఉండేలా మీల్ ప్లాన్ చేసుకోవాలి. అల్పాహారం తీసుకోవడం తప్పనిసరి. ఉదయం తినే అల్పాహారంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఉడకబెట్టిన సెనగలు, బొబ్బర్లు, మొలకలు లాంటి వాటిని సాయంత్రం స్నాక్‌గా తీసుకోవచ్చు.

ద్రవాలూ ముఖ్యమే!

ఒళ్లు నొప్పులకు శరీరంలో నీటి శాతం తగ్గడం ఒక కారణం. కండర నొప్పులు తరచూ వేధిస్తున్నా, కండరాలు పట్టేస్తున్నా శరీరంలో నీరు తగ్గిందని అర్థం చేసుకుని సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులు లేనివాళ్లు రోజుకు కనీసం 3 లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగాలి. ఇది వేసవి కాలం కాబట్టి పండ్ల రసాలూ, కొబ్బరినీళ్లు, పలుచని మజ్జిగ కూడా తీసుకోవచ్చు. సబ్జా నీళ్ల ఆరోగ్యకరం. శరీరాన్ని చల్లబరిచే నిమ్మరసం, క్యారట్, బీట్‌రూట్ జ్యూస్ తాగుతూ ఉండాలి. శీతల పానీయాలు, చక్కెర కలిసి ఉండే పౌడర్ ఆధారిత పానీయాలు, సిరప్స్ దాహార్తిని తీర్చకపోగా, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.



సరిపడా విశ్రాంతి

కంటి నిండా నిద్ర, సరిపడా విశ్రాంతి కూడా అవసరమే! చలాకీగా, చురుగ్గా కదలడానికి సరిపడా ఓపిక శరీరానికి దక్కాలంటే, మధ్నాహ్నం వేళ ఒక అరగంట పాటు కునుకు తీస్తూ ఉండాలి. దాంతో కండరాలు శక్తిని పుంజుకుంటాయి. 7 నుంచి 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవడం వల్ల శరీర బడలిక వదిలి, కొత్త శక్తిని పుంజుకుంటుంది. కాబట్టి నిద్రకు భంగం కలిగించే అంశాలకు దూరంగా ఉంటూ, కంటి నిండా నిద్రపోవాలి.

ఎముకల పటుత్వం ఇలా సాధ్యం

పైబడే వయసులో ఎముకల పటుత్వం క్షీణించడం సహజం. అలా జరగకుండా నియంత్రించాలంటే పోషకాహారంతో పాటు కొన్ని అదనపు సప్లిమెంట్లు కూడా తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **క్యాల్షియం:** అరవై ఏళ్లు పైబడిన స్త్రీపురుషులు క్యాల్షియం సమృద్ధిగా దొరికే పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, డ్రై సీడ్స్, బాదం, పిస్తా తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియం దక్కే వీలు లేని సందర్భాల్లో వైద్యులు సూచించిన సప్లిమెంట్లు వాడుకోవచ్చు.
- **విటమిన్ డి:** ఎముకల దృఢత్వానికి డి విటమిన్ అవసరం. ఆహారం ద్వారా దొరికే అవకాశం లేని డి విటమిన్‌ను పొందడం కోసం కనీసం ఒకటి నుంచి రెండు గంటల పాటు ఎండలో గడపడం అవసరం. సాధ్యపడని సందర్భాల్లో వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- **వ్యాయామాలు:** నడక, పరుగు, బరువులెత్తడం, సైక్లింగ్ శరీరం మీద బరువు పడేలా చేసే వ్యాయామాలన్నీ ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. నడి వయసులో తుంటి ఎముకలు తేలికగా విరిగిపోతూ ఉండడానికి కారణం ఎముకలు గుల్లబారడమే! ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే మరీ ముఖ్యంగా మహిళలు బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి.
- **ఇవి వద్దు:** ఆల్కహాల్, చక్కెర, కాఫీలు ఎముకల సాంద్రతను తగ్గిస్తాయి. వీటికి వీలైనంత దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం ఎముకలకు హానికరం. కాబట్టి ఈ అలవాటు ఉన్నవాళ్లు నడవయసుకు చేరుకున్న తర్వాత పూర్తిగా మానేయాలి.
- **ఆరోగ్య పరీక్షలు:** 55 ఏళ్లు దాటిన మహిళలు, 65 ఏళ్లు దాటిన పురుషులు ప్రతి మూడేళ్లకోసారి ఎముకల సాంద్రతను పరీక్షించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో ఎముకల సాంద్రతను అంచనా వేస్తూ, అప్రమత్తం అవుతూ ఉండాలి. ఎముకలు గుల్లబారే సమస్యను ఈ పరీక్షతో గుర్తించినప్పుడు వైద్యులు సూచించిన మందులు తీసుకోవాలి. వ్యాయామాలు మొదలుపెట్టాలి.

జీవనశైలి వ్యాధులు రాకుండా....

45 ఏళ్లు దాటిన వాళ్లలో అధిక రక్తపోటు, మధుమేహాలు సర్వసాధారణమైపోతున్న కాలమిది. ఇలాంటి జీవనశైలి వ్యాధులు దాడి చేయకుండా ఉండాలంటే...

- వయసు పైబడేకొద్దీ కణాల్లో జరిగే ఆక్సీడేషన్ డ్యామేజీ వల్ల కేన్సర్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీఆక్సీడెంట్లు ఎక్కువగా దొరికే తాజా ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆహారంలో పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నిల్వ ఉన్న పదార్థాలు, ప్యాకేజ్‌డ్ ఫుడ్, చక్కెర, ఉప్పు, నూనెలు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం మానేయాలి.
- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణం. ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఒత్తిడిని వదిలించుకోవాలి. ఇంటి పట్టున ఉండేవాళ్లు నచ్చిన ఏదో ఒక వ్యాపకాన్ని ఎంచుకోవాలి. మెదడును చురుగ్గా ఉంచే ఇండోర్ గేమ్స్, శరీరాన్ని చురుగ్గా ఉంచే ఔట్‌డోర్ గేమ్స్ ఆడుతూ ఉండాలి.
- **వైద్య పరీక్షలు:** అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలున్నవాళ్లు క్రమం తప్పక పరీక్షలు చేయించుకుంటూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. సంబంధిత వైద్య నిపుణులను కూడా సంప్రదిస్తూ ఉండాలి. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఏడాదికోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. గుండెజబ్బు, మధుమేహం ఉన్నవాళ్లు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షలతో ప్రారంభంలోనే సమస్యను గుర్తించే వీలుంటుంది.

డాక్టర్ వేద ప్రకాష్ జి
సీనియర్ కన్సల్టెంట్,
ఆర్థొపెడిక్ సర్జన్ అండ్
జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.



సైకాలజీ

ఇదీ ఓ కారణమే!

కొందరి మానసిక సమస్యలకు వారి వ్యక్తిత్వాలూ కారణమవుతూ ఉంటాయి. కాబట్టి సమస్యనుబట్టి ఎవరికి వారు లోతుగా విశ్లేషించుకుని, వ్యక్తిత్వంలో స్వల్ప మార్పులు చేసుకోగలిగితే ఇబ్బందులు సర్దుకుంటాయి. ఉదాహరణకు....

- సోషల్ యాంగ్జయిటీ, ప్యానిక్ అటాక్స్, డిప్రెషన్: మానసికంగా కుంగిపోయినప్పుడు ఇతరుల సహాయాన్ని అర్థించకుండా ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. ఇలాంటివాళ్లు సరైన సమయంలో వైద్యులతో మాట్లాడితే సమస్య సర్దుకుంటుంది.



- డిప్రెషన్, యాంగ్జయిటీ: పర్‌ఫెక్షనిస్టులు వాళ్ల గురించి వాళ్లు ఎక్కువ అంచనాలు కలిగి ఉంటారు. తమని ఓడించడం ఎవరి తరమూ కాదనే నమ్మకంతో ఉంటారు. దాంతో ఎప్పుడైనా ఓటమిపాలైతే విపరీతంగా కుంగిపోయి, డిప్రెషన్‌లో కూరుకుపోతారు. ఇలాంటప్పుడు ఒత్తిడికి లోనయినట్టు మీ శరీరం చెబుతున్న విషయాన్ని ఆలకించాలి. అంచనాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడితే మానసిక ఇబ్బందులు సమసిపోతాయి.
- బైపోలార్ డిజార్డర్ డిప్రెషన్: సృజనాత్మక వ్యక్తులు గతాన్ని తరచుగా తలుచుకోవడం, జరిగిపోయినదానికి చింతిస్తూ ఉండే వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఇలాంటివాళ్లు మానసిక సమస్యలకు గురి కాకుండా ఉండాలంటే, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించుకుని, తమకున్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దాలి.

ఆయుర్వేదం

మెదడు చురుకుగా...

జ్ఞాపకశక్తి, తెలివితేటలు తగ్గడానికి కారణం పోషకాహార లోపం, మెదడులో తయారయ్యే రసాయనాలలో అసమతౌల్యమే ప్రధాన కారణాలని ఆయుర్వేదం చెబుతోంది. ఈ మార్పులు సహజసిద్ధంగా శరీరంలో జనించవచ్చు, లేదా మందుల ప్రభావం వల్ల కూడా తలెత్తవచ్చు. కఫ దోషం వల్లే జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుందని ఆయుర్వేదం నమ్ముతోంది. ఈ దోషం ఫలితంగా మెదడు పనితీరు మందగించి, ఆలోచనల్లో అస్పష్టత చోటుచేసుకుంటుంది. కాబట్టి జ్ఞాపకశక్తి పెరగాలంటే వాత, కఫ దోషాలను సమతులం చేయాలి. వాత, కఫ దోషాల సమ్మేళనం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. పిత్త దోషం మెదడు చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఈ దోషాలన్నీ సమతులం కావాలంటే ఆహారవ్యవహారాల్లో కొన్ని మార్పులు చేసుకోవాలి.



- **ఆహారం:** దోష తత్వం ఆధారంగా ఆహారశైలిని అనుసరించాలని ఆయుర్వేదం సూచిస్తున్నా, మరీ ముఖ్యంగా జ్ఞాపకశక్తికి సంబంధించి కొన్ని నిర్దిష్టమైన ఆహారనియమాలు పాటించవలసి ఉంటుందని కూడా ఆయుర్వేదం సూచిస్తోంది. అవేంటంటే...
- సులువుగా అరిగే, ఒంట్లోని విషాలను హరించే ఆహారంతో శరీరంలో కఫ సంబంధ అవరోధాలు తొలగి, వాత మార్గాలు తెరుచుకుంటాయి. అలాగే ఇలాంటి ఆహారం పిత్త పనితీరును పెంచి, తత్ఫలితంగా జ్ఞాపకశక్తినీ, తెలివితేటలనూ పెంచుతుంది.
- కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, నెయ్యి, నారింజ, క్యారెట్లు, నట్స్‌లతో కూడిన సమతులాహారం తీసుకోవాలి.
- జున్ను తినకూడదు. మాంసాహారానికి దూరంగా ఉండాలి.
- జ్ఞాపకశక్తి, తెలివితేటలను పెంచే వాత, పిత్త, కఫ దోషాల మధ్య సమతులం సాధించాలంటే బెల్లం లేదా తేనెలకు దీర్ఘకాలం పాటు ఆహారంలో చోటు కల్పించాలి.
- టీ, కాఫీలకు దూరంగా ఉండాలి.

గుడ్ ఫుడ్

మెంతులు మేలు!

మెంతులను నిల్వ పచ్చళ్లలో తప్ప వంటకాలలో పెద్దగా ఉపయోగించం. కానీ పిల్లలకు పాలిచ్చే తల్లులకు మెంతులు మేలు చేస్తాయి. పాల ఉత్పత్తిని పెంచి, పసికందుకు పాల కొరత తీరుస్తాయి.

పిల్లలకు పాలిచ్చే తల్లుల ఆహారంలో మెంతులను చేర్చడం మన దేశ ఆనవాయితీ. ఉత్తర భారతదేశంలో మెంతి లడ్డు, దక్షిణాదిన పొడులు, ముద్దల రూపంలో వాడుతూ ఉంటారు. ఈ సంప్రదాయం వెనక సైన్స్ దాగి ఉంది. ప్రసవించిన మహిళలకు మెంతులు ఎంతో ఉపయోగకరం. వారిలో పాల ఉత్పత్తిని పెంచుతాయని జంతువులు, మనుషుల మీద జరిపిన పలు పరిశోధనల్లో రుజువైంది. 'గ్యాలెక్టగోగ్' అనే పాల ఉత్పత్తికి తోడ్పడే మూలిక లేదా ఔషధంగా మెంతులను వర్గీకరించారు. ఈ విత్తనాల్లో ఉండే 'డయాస్టానిన్' పాల ఉత్పత్తి జరిగే మామరీ గ్రంథులలోని కణజాలం పెరుగుదలకు, తోడ్పడుతుంది. ఫలితంగా పాలు త్వరితంగా, ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇందుకోసం రోజుకు 10 విత్తనాలు తీసుకుంటే సరిపోతుంది.



రోజుకు ఒకటి లేదా రెండు మెంతి లడ్లను పాలిచ్చే తల్లులకు తినిపించవచ్చు. వీటికి బెల్లం, శొంఠి, డ్రై ఫ్రూట్స్, నెయ్యి జోడించాలి. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో మెంతి పొడికి, పసుపు, శొంఠి, బెల్లం, ఇతర మూలికలు చేర్చి ఉడికించి, హల్వా ఉండగా చేసి పరగడుపున తినిపించడం ఆనవాయితీ. ఒకవేళ బరువు పెరగకుండా మెంతుల మేలు అందుకోవాలనుకుంటే, మెంతులను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం పరగడుపున తీసుకోవచ్చు. ప్రత్యామ్నాయంగా మెంతులను పొడి చేసి, తేనె లేదా గోరువెచ్చని నీళ్లతో కలిపి తీసుకోవచ్చు. అయితే గర్భిణులు మెంతులకు దూరంగా ఉండాలి. గ్యాలెక్టగోగ్ కోవకు చెందిన మెంతుల్లో యుటెరోటోనిక్ ఏజెంట్ ఉంటుంది. ఇది కండరాల సంకోచవ్యాకోచాలకు కారణమవుతుంది. కాబట్టి గర్భవిచ్ఛిత్తికి ఆస్కారం ఉంటుంది.

కెగెల్ ఎక్సర్‌సైజెస్

నడుము దృఢంగా!

కొన్ని వ్యాయామాలు అంతర్గత జీవక్రియలు, వ్యవస్థల పనితీరును క్రమబద్ధీకరిస్తాయి. దైనందిన జీవితానికి ఇబ్బంది పెట్టే స్వల్ప సమస్యలనూ పరిష్కరిస్తాయి. అలాంటి వాటిలో చెప్పుకోదగినవి 'కటి వ్యాయామాలు'!

కటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలు స్త్రీపురుషులు ఇద్దరికీ ఉపయోకరమే! కటి ప్రదేశంలోని కండరాలు బలపడే ఈ వ్యాయామాలు చేయడం వల్ల మూత్ర వ్యవస్థకు సంబంధించిన కొన్ని సమస్యలు దూరమవుతాయి. మరీ ముఖ్యంగా తుమ్మినా, దగ్గినా మూత్రం లీక్ అయిపోయే ఇబ్బంది తొలుగుతుంది. స్త్రీలలో ప్రసవానంతరం తలెత్తే ఈ రకం సమస్య కటి వ్యాయామాలతో అదుపులోకి వస్తుంది. ఈ వ్యాయామాలను అమెరికాకు చెందిన స్త్రీల వైద్యులు 'ఆర్నాల్డ్ కెగెల్' కనుగొన్నారు కాబట్టి వీటికి 'కెగెల్ ఎక్సర్‌సైజెస్' అనే పేరొచ్చింది.

కెగెల్ వ్యాయామాలు అంటే?

ఈ వ్యాయామాలనే 'పెల్విక్ ఫ్లోర్' వ్యాయామాలు అని కూడా అంటారు. కటిలోని కండరాలను బిగదీసి, వదిలే ఈ వ్యాయామాలు రోజు మొత్తంలో ఎన్ని సార్లైనా చేయవచ్చు. సరైన ఫలితం దక్కడం కోసం కనీసం 3 నెలల పాటు వ్యాయామాలు చేయాలి. తేలికగా ఉండే ఈ వ్యాయామాలను రోజులో ఏ సమయంలోనైనా చేయవచ్చు. కూర్చున్నా, పడుకుని ఉన్నా కూడా ఈ వ్యాయామాలు చేయవచ్చు. తింటున్నప్పుడు, కుర్చీ మీద కూర్చుని పని చేసుకుంటూ, టివి చూస్తూ విరామంగా ఉన్నప్పుడు కూడా చేయవచ్చు.

ఆరోగ్య ప్రయోజనాలు

- విసర్జక వ్యవస్థ అదుపులో ఉండేందుకు ఈ వ్యాయామాలను స్త్రీపురుషులు ఇద్దరూ చేయవచ్చు.
- శస్త్రచికిత్సల తదనంతరం కండరాలను బలోపేతం చేయడం కోసం ఈ వ్యాయామాలను అనుసరించాలి. ప్రోస్టేట్ సంబంధిత శస్త్రచికిత్సల తదనంతరం పురుషులు, పునరుత్పత్తి వ్యవస్థల సంబంధిత శస్త్రచికిత్సల అనంతరం స్త్రీలు ఈ వ్యాయామాలను చేయాలి.
- వృద్ధాప్యం మూలంగా బలహీనపడే కటి కండరాల బలోపేతానికి కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.
- ప్రసవం తదనంతరం మహిళలు ఈ వ్యాయామాలను క్రమం తప్పక చేస్తే పునరుత్పత్తి సంబంధిత అంతర్గత అవయవాలన్నీ తిరిగి సాధారణ స్థితికి చేరుకుంటాయి.
- మూత్రాశయం, దాని చుట్టుపక్కల కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. కాబట్టి చిన్న ఒత్తిడికే మూత్రం కారిపోయే పరిస్థితి ఉన్న స్త్రీపురుషులు ఈ వ్యాయామాలు ఎంచుకోవాలి.
- పొట్టలోని పేగులు పొత్తికడుపులోకి జారే సమస్య ఉన్నవారు కూడా ఈ వ్యాయామాలు చేయాలి.
- తెలియకుండా మలవిసర్జన జరిగిపోయే సమస్య ఉన్నవాళ్లకు కూడా ఈ వ్యాయామాలు ఉపయోగకరం.

ఇలా చేయాలి

ఈ వ్యాయామాలు చేసేటప్పుడు స్త్రీపురుషులు వేర్వేరు పద్ధతులు పాటించాలి.

- **సరైన కండరాలు:** మూత్రవిసర్జన చేయబోయి, ఆపుతున్నట్టు కండరాలను కదిలించడమే కెగెల్ ఎక్సర్‌సైజ్. మూత్రవిసర్జనతో సంబంధం ఉన్న కండరాలు బిగబట్టి, వదులు చేస్తూ ఉండాలి. అయితే సంబంధిత కండరాలేవో గ్రహించి, వాటిని మాత్రమే ఉపయోగించాలి. తర్వాత మూత్రవిసర్జన చేయడానికి వెళ్లినప్పుడు మూత్రవిసర్జనను మధ్యలో ఆపేయాలి. ఇలా చేస్తున్నప్పుడు ఏ కండరాలు మూత్రవిసర్జనను అదుపు చేస్తున్నాయో స్వయంగా గ్రహించగలుగుతారు. మహిళల్లో (యోని), మూత్రాశయం లోని కండరాలు బిగుసుకుని, పైకి లాగబడతాయి. ఈ కండరాలే మహిళలకు సంబంధించిన కటి కండరాలు. ఈ కండరాలే వ్యాయామం చేసే సమయంలోనూ బిగుసుకుంటూ ఉంటే వ్యాయామం సరిగా చేస్తున్నారని అర్థం. అలాగే తొడలు, పిరుదులు, పొత్తికడుపు కండరాలు ఈ వ్యాయామం చేసే సమయంలో విరామ స్థితిలో ఉండాలి.

వ్యాయామం ఇలా!

- మూత్రాశయం ఖాళీగా ఉంచాలి. పొట్టలో వాయువులు ఉండకూడదు.
- మీ సౌకర్యాన్ని బట్టి కూర్చుని లేదా పడుకుని వ్యాయామం చేయాలి.
- నెమ్మదిగా కటి కండరాలను బిగపట్టి, 10 అంకెలు లెక్కపెట్టి వదలాలి.
- వదిలిన తర్వాత మరో 12 అంకెలు లెక్కపెట్టి తిరిగి బిగపట్టాలి.
- వ్యాయామం చేస్తున్నంతసేపు, గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని, శరీరాన్ని విశ్రాంత స్థితిలో ఉంచాలి. పొట్ట, తొడలు, ఛాతీ కండరాలు బిగదీయకూడదు. పొత్తికడుపు కండరాలు విశ్రాంతంగా ఉంచాలి.

ఈ వ్యాయామాలను క్రమం తప్పకుండా 4 నుంచి 6 వారాలపాటు చేయాలి. క్రమక్రమంగా కటికి సంబంధించిన సమస్యలు దూరమవుతాయి. అయితే ఈ వ్యాయామాలను అవసరానికి మించి చేయడం వల్ల మల,మూత్రవిసర్జన సమయంలో కండరాల నొప్పులు మొదలవుతాయి.



గమనిక

- ఈ వ్యాయామాలను సరైన పద్ధతిలో చేయని మహిళలకు లైంగిక కలయిక సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చు.
- ఈ వ్యాయామాలను చేస్తూ, కొంతకాలం తర్వాత ఆపిన మహిళల్లో తిరిగి మూత్రం కారిపోయే సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ఎక్కువ కాలంపాటు ఈ వ్యాయామాలు చేయాలి.
- ఈ వ్యాయామాలు చేయడం మొదలుపెట్టిన చాలా కాలం తర్వాత మాత్రమే మూత్రం కారడం, మలవిసర్జన సమస్యలు అదుపులోకి వస్తాయి.

వైద్యులను కలవాలి

- ఈ వ్యాయామాలను సక్రమంగా చేస్తున్నారో, లేదో తెలుసుకోవడం కోసం వైద్యులను కలవడం అవసరమే! వైద్యుల సూచనల మేరకు వ్యాయామాల మీద పట్టు సాధించి సాధన చేయడం ద్వారా కటి సంబంధ కండరాల బలహీనతతో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చు.

హెల్త్ వెల్త్

నోటి దుర్వాసన ఎందుకు?



నోటి దుర్వాసన కేవలం నోటి శుభ్రతా లోపం వల్లనే కాదు! మరెన్నో అంతర్గత రుగ్మతల ప్రధాన లక్షణం కూడా! ఉదర కేన్సర్ కూడా నోటి దుర్వాసన ద్వారానే బయల్పడుతుంది. కాబట్టి మూల కారణాన్ని కనిపెట్టి, చికిత్స తీసుకోవాలి.

- **చిగుళ్ల వ్యాధి:** పెరియోడాంటైటిస్, జింజివైటిస్ అనే ప్రధానమైన చిగుళ్ల వ్యాధుల్లో నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్యలు ఉన్నప్పుడు చిగుళ్లు వాచి, రక్తం, చీము కారుతూ ఉంటాయి. వ్యాధికారక బ్యాక్టీరియా చిగుళ్లలో తిష్ట వేయడమే ఇందుకు కారణం. ఈ లక్షణాలకు తోడు నోటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుంటే, చిగుళ్ల వ్యాధిగా భావించి దంత వైద్యులను సంప్రతించాలి.
- **ఎలర్జీలు:** గొంతులో దురద, ముక్కు దిబ్బెడ, కంటి నుంచి నీరు కారడం లాంటి ఎలర్జీలు ఉంటే వాటికి తోడు నోటి దుర్వాసన కూడా అనుభవంలోకి వస్తుంది. తెమడ చెడు సూక్ష్మక్రిములకు నెలవు. వాటి వల్ల నోటి దుర్వాసన మొదలవుతుంది. అలాగే ఎలర్జీలు ఉన్నప్పుడు నోరు ఎండిపోతూ ఉంటుంది. దీని ఫలితంగా కూడా నోటి నుంచి దుర్వాసన వెలువడుతుంది. ఈ దుర్వాసన వదలాలంటే తెమడ వదిలించుకుని, జలుబు, దగ్గులను మందులతో అదుపు చేసుకోవాలి.

కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 26: జిల్లా పరిధిలోని విద్యార్థులను ఫీజులు చెల్లించాలని హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో డీఐఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కళాశాల యాజమాన్యాలతో సబంధం లేకుండా ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు పొంది పరీక్షకు హాజరు కావచ్చని, దానిపైన ప్రిన్సిపాల్ సంతకం అవసరం ఉండదని డీఐఈవో తెలిపారని అన్నారు. బీఆర్‌ఎస్వీ నాయకులు మట్టి శ్రీనివాస్, కరుణాకర్, రుద్రవేని సుదీప్, సందీప్, నవీన్, రాకేష్, గణేష్, జగన్, నరేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా ఆటల పోటీలు



బహుమతి అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 26: గ్రామీణ ప్రాంతాలలో పోటీల నిర్వహణ ద్వారా కొత్త క్రీడాకారులు వెలుగులోకి వస్తారని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. మండలంలోని గాలిపెల్లిలో ఈతరం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు పుట్టినిల్లు గాలిపెల్లి అన్నారు. ఈతరం యువజన సంఘం ప్రతిసారి పోటీలు నిర్వహించి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ సింగిరెడ్డి శ్యామలాదేవి, మాజీ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు గోవికారి నరేష్, సంస్థ వ్యవస్థాపకులు ఎంఢ్ర నారాయణ, మాజీ ఎంపీటీసీ రాజేశం, అర్కుటి మల్లేశం, మాధవరెడ్డి, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

జిల్లెల్ల పెద్దచెరువులోకి రంగనాయక సాగర్ నీటిని వదలాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని పెద్ద చెరువులోకి రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని వదలాలని ఆ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్లలో కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి జిల్లెల్ల కొత్తచెరువులోకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో కాలువల ద్వారా నీటిని తీసుకొచ్చినట్లు చెప్పారు. పెద్ద చెరువులోకి పోయేందుకు కాలువ నిర్మాణానికి రైతులనుంచి తీసుకున్న భూములకు పరిహారం రాలేదని, పరిహారం అందించి కాలువను పూర్తి చేసి చెరువులో నీటిని నింపాలని కోరారు. కార్యక్రమంలో అబ్బాడి తిరుపతిరెడ్డి, నర్రసతీష్ చంద్రారెడ్డి, అసరి బాలరాజు, కోమ్మటి రాజిరెడ్డి, చెట్టు శ్రీనివాస్, బెల్లం వినోద్, బాగయ్య పాల్గొన్నారు.

తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : వయోజన విద్యాశాఖలో పనిచేసిన మాజీ సాక్షరభారత్ మండల, గ్రామ కో- ఆర్డినేటర్‌లను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గతంలో వయోజన విద్యాశాఖలో ఆధ్వర్యంలో నిర్వహించిన సాక్షరభారత్ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయిల్లో పూర్తి స్థాయి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సేవలను అందించినట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా సకల జనుల సమ్మెలో పాల్గొన్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీ మేరకు విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అంతకుముందు కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కో- ఆర్డినేటర్‌లు మహేందర్, కవిత, నరేందర్, విద్యా సుజాత, ప్రేమలత, పద్మ, శారద, రమ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌ల మార్పిడిపై విచారణ చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : మిడ్‌మానేరు నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్లాట్‌ల మార్పిడిపై విచారణ చేపట్టాలని, అలాంటి ప్లాట్‌లను రద్దు చేయాలని నిర్వాసితులు కోరారు. సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. నిర్వాసితులు చొక్కాల రాము, వంగ పర్శరాములుతోపాటు అంజనేయులు, దేవరాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని సోమవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించారు. సిరిసిల్లకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. సదరు వ్యక్తి మతిస్థిమితం లేనట్లు సమాధానం చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేలి ముద్ర నమూనాలను సేకరించినట్లు,వివరాలు తెలుసుకుంటున్నట్లు పోలీసులు వివరించారు.

మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, ఫిబ్రవరి 26: ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం పెద్దగుట్టలో మొక్కులు చెల్లించుకున్నారు. కోనరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో నాయకులు మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు నరేష్, నందు గౌడ్, సుంకరి రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం బోనస్‌పై జీవో విడుదల చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నేతల లేఖ

కథలాపూర్, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం వరికి రూ.500 బోనస్‌కు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌లోపు జీవో విడుదల చేయాలని రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని భూషణరావుపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరి పంటకు బోనస్, రైతుబంధు ఎకరానికి ఏటా రూ. 15 వేలు, రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని నమ్మించి ఓట్లు దండుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రబీ పంట కోతల దశకు చేరుకున్నా నేటికీ రైతుబంధు జమకాలేదన్నారు. ఇప్పటికే రైతాంగం చీడపీడలతో నష్ట పోతోందని, రైతుబంధు, బోనస్ అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీడ్ పోస్ట్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ పంపించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు బద్దం మహేందర్ రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, పురుకుటపు నరేంధర్, పురుకుటపు సంతోష్, మేగ్యానాయక్, కృష్ణ ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అన్నారు. అంతకుముందు జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. వివిధ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వీరబుచ్చయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● భూ సమస్య పరిష్కరించాలంటూ సిరిసిల్ల పట్టణానికి చెందిన కల్లెపల్లి ప్రమీల అనే దివ్యాంగురాలు వీల్‌చైర్‌లో ప్రజావాణికి వచ్చింది. స్పందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు సూచించారు.

● పెద్దూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో హిందువులు, ముస్లింలు ఉంటున్నారని,గుడి, మసీద్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు విన్నవించారు. కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రాన్ని అందించారు.

● మధ్యమానేరు జలశాయంలో మునిగిపోయిన చీర్లవంచ గ్రామానికి చెందిన వారికి గెజిట్‌ను కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. బాధితులు ఇనుకొండ నరహరి, నర్సింహులు, లక్ష్మణ్, తిరుపతి, సాయయ్య, రాజవ్వ, ఉపేందర్, మ్యాకల శ్రీలత, ఇనుకొండ పుష్ప, చల్లబాలరాజు ఉన్నారు.

● ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో బంజారి వీరయ్య పేరున ఉన్న ఇంటిని బాలయ్య తన పేరుమీద మార్చుకొని అతడి కుమారుడు చిరంజీవిపేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వీరయ్య వారసులమైన తకు వాటా ఉంటుందని, న్యాయం చేయాలంటూ కిరణ్‌కుమార్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించాడు.



సమస్యలను వింటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆరు గ్యారంటీల అమలును సహించని బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 26 : ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న తీరును సహించలేని బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారని, అలాంటివి సహించబోమని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పందండి ప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాగానే మొదట ఆరు గ్యారెంటీల్లో రెండు ప్రారంభించినట్లు చెప్పారు. గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలను ప్రారంభించడానికి మంగళవారం చేవెళ్లకు వస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. వరసక్రమంగా మరికొద్ది రోజుల్లో మిగతా పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పటికి అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ కుంగి పోవడం, తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడం వంటివి బీఆర్‌ఎస్ పాలనకు నిదర్శనన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నవారు తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి లక్షల కోట్లు స్వాహా చేశారని, మళ్లీ అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పగిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ భారాన్ని భుజాన వేసుకొని క్రమక్రమంగా ఆర్థిక వనరులను సర్దుబాటు చేసుకుంటూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారని అన్నారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ కార్యదర్శి కోడం అరుణ, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీందర్, నాయకులు వంగరి దేవదాస్, రంగ కిషన్, వైద్య శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ఎండీ ఖాజా, వెంగళ అశోక్, గుజ్జె రమేష్, నాయిని కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ నేతకార్మికులకు జీవనభృతి అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : పద్మశాలీ నేతకార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం జీవనభృతి అందించాలని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథుల రమేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంతోపాటు తంగళ్లపల్లి మండలంలో అత్యధికంగా పద్మశాలీలు నేతవృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్‌లను ఇవ్వకపోవడంతో నేతకార్మికులు 50 రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నెలకు 50 కిలోల బియ్యం, నిత్యావసరాలు, రూ.3వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పయ్యావుల కనుకయ్య, సహాయ కార్యదర్శి గ్యాద సత్తయ్య, అన్నల్‌దాస్ వెంకటేశం, పయ్యావుల లక్ష్మణ్, తిప్పవరం మల్లేశం, ఇప్పలపల్లి గణేష్, దీకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిన పదోన్నతులు కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న హెల్పర్‌లకు పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఐసీడీఎస్‌లో 9వేల ఉద్యోగుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతులు, విద్యార్హత ఇంటర్‌కు మార్పు చేశారని, దీంతో ఎక్కువ మంది అంగన్‌వాడీ హెల్పర్‌లు నష్టపోతున్నారని అన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, వయస్సు పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఈ జిల్లా నాయకుడు అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 26 : సిరిసిల్లలో బుధవారం చేపట్టనున్న నేతన్న అకలికేక మహాధర్నా సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఆసాముల సమన్వయ కమిటీఅధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న ఆసాములు, మరమగ్గాల కార్మికులతోపాటు అన్ని రంగాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌లను ఇవ్వాలని, బకాయిలతోపాటు పదిశాతం యారన్ సబ్సిడీ చెల్లించాలని కోరారు. మహాధర్నాకు మాజీ ఎమ్మెల్యే చెరుపల్లి సీతారాములు హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, మండల రాజు, బెజుగం సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26: ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ దేవరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని కోనేటి పోచయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా మొదటి భార్యకు కోనేటి ఎల్లయ్య, రెండో భార్యకు ఆరుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కోనేటి పోచయ్య 2010లో మృతి చెందగా తండ్రికి చెందిన ఆస్తిపై కొంతకాలంగా మొదటి భార్య, రెండో భార్య కొడుకుల మధ్య వివాదం కొనసాగుతోంది. రెండో భార్యకు సంబంధించిన కుమారులు ఆస్తిని తమ పేరిట రిజిస్ట్రేషన్‌తోపాటు గ్రామపంచాయతీ రికార్డుల్లో పేరు మార్పిడి చేయించుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గ్రామపంచాయతీ నిరాకరించడంతో హైకోర్టు ఆశ్రయించారు. దీంతో రికార్డులను పరిశీలించి రెండో భార్య కొడుకులైనా ఆరుగురికి మాత్రమే చెందుతుందని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి హైకోర్టులో నివేదిక సమర్పించారు. ఈ విషయంపై తప్పుడు నివేదికలు ఎందుకు సమర్పించావంటూ పంచాయతీ కార్యదర్శిని కోనేటి ఎల్లయ్య అతడి కొడుకు శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆగ్రహించిన పంచాయతీ కార్యదర్శి తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు గురి చేశాడని బాధితుడు కోనేటి ఎల్లయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కార్యదర్శి దేవరాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26: మిడ్‌మానేరు ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని స్వాన్ అసోషియేషన్ అధ్యక్షుడు చెరపల్లి స్వరన్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వరన్‌కుమార్ మాట్లాడుతూ ముంపు గ్రామాలను వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తీసివేసి గ్రామపంచాయతీలోనే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు గ్రామాల యువతకు 1985లోని జీవో నంబరు 98 ప్రకారం అలాగే 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు చదువు, అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, నిర్వాసిత కుటుంబాలకు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ముంపు గ్రామాల నిర్వాసిత యువతకు మొదటి ప్రాధాన్యంగా కాంట్రాక్టు ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామంలో వ్యవసాయం మీదా ఆధారపడి బతికే తమకు భూములు లేకుండా పోయాయని, ప్రజలు అత్యవసరాలకు అప్పులు చేసి ఉపాధి లేక వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని అన్నారు. కొంతమంది బతుకు భారంమై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, అన్ని విధాలుగా ముంపు గ్రామల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అనారోగ్యంతో సినీ డైరెక్టర్ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26:ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన చిదుగు రవిగౌడ్ (42) అనే యువకుడు అనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంబీఏ పూర్తి చేసిన రవిగౌడ్ హైదరాబాద్, బెంగుళూర్‌లోని నివాసం ఉంటూ చిత్రసీమలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. కన్నడంలో 'షాజీ' సినిమాకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. పరీక్షించిన వైద్యుడు బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారించారు.

చెరువులో చేపలు మృత్యువాత

ముస్తాబాద్ ఫిబ్రవరి 26: మండలంలోని తెర్లుమద్ది మోతుకుల కుంట చెరువులో సోమవారం మూడు వేల చేపలు మృత్యువాత పడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. ఎవరైనా చెరువులో విషం కలిపారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటనకు కారణమైన వారిని శిక్షించాలని మత్స్యశాఖ డైరెక్టర్లు గాడిచర్ల దేవయ్య, ముచ్చర్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు పోలీసులను కోరారు.

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి మహిళ మృతి

కథలాపూర్, ఫిబ్రవరి 26:మండలంలోని చింతకుంట శివారులో ట్రాక్టర్ ట్రీలీ కింద పడి వేముల పోశవ్వ(55) అనే మహిళ సోమవారం మృతి చెందింది. ట్రాక్టర్ డ్రైవర్ సురరాము నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాలీ పోశవ్వ మీద పడింది. దీంతో పోశవ్వ గాయాలపాలైంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోశవ్వ భర్త ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో ఎల్లంపల్లి నీటి విడుదల



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

రుద్రంగి, ఫిబ్రవరి 26 వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో అధికారులు సోమవారం రుద్రంగికి ఎల్లంపల్లి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా గండి వేంకటేశ్వర్లస్వామి ఆలయం వద్దకు ఎల్లంపల్లి నీరు చేరుకోవడంతో కాంగ్రెస్ నాయకులు, రైతులు, మ్యత్సకారులు గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం రైతులు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారని, దీంతో వెంటనే ఇరిగేషన్ అధికారులను ఆదేశించడంతో తెగిపోయిన కాలువలకు మరమ్మతు చేయించి నీటిని విడుదల చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, అభిలాష్, పూదరి మహిపాల్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, రవి, ఇప్ప మహేష్, సూర యాదయ్య, గంధం మనోజ్, నంద్యాడపు మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, గొల్లపల్లి, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకుబీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టపడి చదువాలన్నారు. బొప్పాపూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు గీతాంజలి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలానికి పట్టా అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 26: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో గ్రామ శివారులోని మైసమ్మ చెరువు శిఖంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రానికి పట్టాతోపాటు పాసుబుక్‌లను అందించాలని సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారపు నారాయణగౌడ్ కోరారు. 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జారం నారాయణగౌడ్ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. పదేళ్ల నుంచి కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆ స్థలాన్ని కొనుగోలు కేంద్రం కోసం కేటాయించాలని అప్పటి కలెక్టర్‌తోపాటు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలను అందించామని, సింగిల్ విండో మహాసభల్లో తీర్మానం చేశామని తెలిపారు. ప్రస్తుతం 2ఎకరాల 27 గుంటల స్థలంలో కొనుగోలు కేంద్రం కొనసాగుతోందని దీనికి పట్టాతోపాటు పాసుబక్‌లను అందించాలన్నారు. పెద్దూర్ శివారులోని రెండో బైపాస్ అనుకొని ఉన్న ప్రభుత్వ భూముల్లో 5 ఎకరాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముష్కం సత్తయ్య, మెడుదుల దేవయ్య, పంచాగం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలకు సర్కారు కట్టుబడి ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిందన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ మాఫీ పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు అర్థరహిత ఆరోపణలు మానుకోవాలని, ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలకాలని సూచించారు. నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, కృష్ణమూర్తి, బాబు, రాజు, రాంరెడ్డి, ఇమాం, దేవరాజు తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్నాయని, ఇప్పడు గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను శ్రీకారం చుట్టనుందని అన్నారు. గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిధులను విడుదల చేయడం సంతోషకరమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు రోజురోజుకు విశ్వాసం పెరుగుతోందన్నారు. నాయకులు జమాల్, సురేందర్ రెడ్డి, రమేష్, లింగం, వీరేషం, ప్రసాద్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా నెరవేస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు నెరల్లా నరసింగం, లింగాల భూపతి, గుగ్గుళ్ల శ్రీకాంత్, పొన్నాల పరుశురాం, ఎగుర్ల ప్రశాంత్,మోర లక్ష్మీరాజం, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలుపరిచేందుకు కట్టుబడి ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు అతితక్కువ సమయంలోనే అమలు పరుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 26: తంగళ్లపల్లి మండెపల్లి ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు 'గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్నలింగం, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ వార్డు సభ్యులు పసుల శేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు నక్క రవి, ప్రిన్సిపాల్ ఆరాధన, ఉపాధ్యాయులు, నాయకులు గణప మదన్‌రెడ్డి, బుస్స లింగం, గుర్రం కిషన్‌గౌడ్, రాగిపెల్లి కిష్టారెడ్డి, లింగంపెల్లి రాజు, పెద్ది రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీలో 10వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ సూచనలతో గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని 14 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 478 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, సీనియర్ నాయకులు మీనయ్య ఉన్నారు.

నిరుపేద వైద్యానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో ఇటీవల ఇంటి భవనం పైనుంచి కింద పడిన నిరుపేద శ్రీగాధ భాస్కర్ వైద్యానికి పలువురు ఆర్థికసాయం అందించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి రూ.4 వేలు, చేయూత మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల నగదు అందజేశారు. నాయకులు హసన్, భాస్కర్, ఫౌండేషన్ సభ్యుడు శ్రీనివాస్, ఆంజనేయులు, బాలరాజు, శ్రీధర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు చట్టాలను ఉపసంహరించుకోవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 26 : ఆదానీ, అంబానీ కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ తీసుకొచ్చిన సాగుచట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం అం బేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ, అఖిల భారత సంయుక్త కిసాన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గుంటి వేణు మాట్లాడారు. ఢిల్లీ సరిహద్దుల్లో అనేక రాష్ట్రాలకు చెందిన రైతులు పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టవద్దని రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారని అన్నారు. పోరాటంలో దాదాపు 750 మంది రైతుల్లో కొందరు ఆత్మహత్య చేసుకున్నారని, మరికొందరి పోలీసుల కాల్పుల్లో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారస్ మేరకు పండించిన పంటపైన 50 శాతం పెట్టుబడి ఇచ్చి రైతులను గట్టు ఎక్కించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారన్నారు. మరణించిన రైతు కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయాల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు పోరాడుతున్నారన్నారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరాం మూడు రాష్ట్రాల ఎన్నికల సమయంలో సాగు చట్టాలను ఎత్తివేస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫారస్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఆ ఎన్నికలు పూర్తవగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశంలోని దాదాపు 60 కోట్ల మంది రైతులు, వామపక్షాలు, ప్రజాతంత్ర వాదులు, లౌకికవాదులు ముందుకొస్తున్నారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు పాల్గొన్నారు.

వేములవాడ : బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం వేములవాడలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేస్తున్న నిరసనను పట్టించుకోకపోవడంతో పాటు రైతులపై దాడులు చేస్తున్నందుకు నిరసనగా మోదీ దిష్టిబొమ్మను దహనం చేశామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాజుల పోశెట్టి, పెంట మల్లయ్య పెంట శ్రీనివాస్, క్రాంతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.